## క్లుప్తంగా

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎస్‌ఏ. రజాక్

మద్దిరాల : వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాం రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు గుడ్ల వెంకన్న, కన్న వీరన్నగౌడ్, కోడి శ్రీనివాస్, మల్లు కళింగారెడ్డి, రావుల వెంకన్న, పాతూరి లింగారెడ్డి, వడ్లాణం మధుసూదన్, ఎంపీటీసీలు శిరంశెట్టి వెంకన్న, అవిలయ్య, పాలబిందెల శ్రీనివాస్, చాపల వెంకన్న, బెడద వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

### పీఆర్సీ పెంపుపై హర్షం

నూతనకల్ : తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు పీఆర్సీ పెంపుపై తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా సభ్యుడు గంటా భిక్షపతి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పీఆర్సీ పెంచడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 583మంది సాంస్కృతిక సారథి కళాకారులకు నెలకు రూ.31868 వేతనాలు అందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు.

### 31న రాఖీ జరుపుకోవాలి

భానుపురి : రాఖీ పౌర్ణమి విషయంలో ఎవరూ అపోహలకు గురి కాకుండా ఈ నెల 31న జరుపుకోవాలని అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు వలివేటి వీరభద్ర స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న బుధవారం ఉదయం 10.42 గంటలకు సూర్యోదయం తర్వాత చాలాసేపటికి పౌర్ణమి వస్తుందని తెలిపారు. 31వ తేదీ సూర్యోదయానికే పౌర్ణమి ఉంటుందని పేర్కొన్నారు. శాస్త్రప్రకారం ఈ నెల 30న రాఖీ పౌర్ణమి జరుపుకోకూడదని తెలిపారు.

### ఖేలో ఇండియా పాఠశాలకు ఎంపిక



పవన్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి మా మిడి పవన్ కోదాడలోని ఖేలో ఇండియా క్రీడా పాఠశాలకు ఎంపిక య్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం కె.తబిత, పీడీ సోమయ్య తెలిపారు. 24న కోదాడలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో కబడ్డీ పోటీలో ఈ విద్యార్థి ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా పవ న్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. పవన్ తండ్రి నాగరాజు జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

### మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్‌కుమార్

తిరుమలగిరి : రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని మార్కెట్ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతి సతీష్‌కుమార్ సొంత ఖర్చులతో రూ.50 వేల విలువైన చీరలను మార్కెట్ కార్యాలయం, మున్సిపాలిటీలో పనిచేస్తున్న మహిళలకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు చైర్‌పర్సన్‌కు, కౌన్సిలర్లకు రాఖీలు కట్టారు. చైర్‌పర్సన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల శ్రీను, సరిత, శ్రీలత, ప్రియలతారాము గౌడ్ డైరెక్టర్లు భిక్షం, లక్ష్మయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

### ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

కోదాడ : మున్సిపాలిటీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపాలిటీ కార్మికులు కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు వినతిపత్రం అందించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, కుడుముల గోపి, ధనమ్మ, లింగయ్య, వెంకటేశ్వర్లు, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయాల్లో అన్నదానం

చిలుకూరు : శ్రావణ మాసం మంగళవారం సందర్భంగా చిలుకూరులోని వీరాంజనేయ స్వామి, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పనులు చేసినా బిల్లులు రావాయే..

- ప్రభుత్వ పాఠశాలల్లో నత్తనడకన మన ఊరు – మన బడి పనులు
- బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు



మన ఊరు-మన బడి పనులు మధ్యలోనే ఆగిపోయిన జలాల్‌పురం ప్రాథమిక పాఠశాల



పనులు పూర్తయిన తొండ ప్రాథమిక పాఠశాల

తిరుమలగిరి : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపొందించాలని, విద్యా ప్రమాణాలు కూడా అదే రీతిలో పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి పథకం అమలు చేస్తోంది. కానీ తిరుమలగిరి మండలంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. గతేడాది మార్చిలో మన ఊరు – మన బడి పనులు ప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల్లోనే ఈ పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ పాఠశాలలు ప్రారంభమై నెలలు గడిచినా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్ని చోట్ల పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. మరికొన్ని పునాదుల దశలోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పనులు పూర్తయినా బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. రూ.30 లక్షలలోపు పనులకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, రూ.30 లక్షల పైచిలుకు పనులకు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారు.

**పదిహేను పాఠశాలలు.. రూ.5.74 కోట్లు..**

తిరుమలగిరి మండలంలో పదిహేను పాఠశాలలకు మన ఊరు–మన బడి పనులు మంజూరయ్యాయి. ఈ పాఠశాలల్లో పనులు చేయడానికి రూ.5.74 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం మండలంలోని ఎస్సీ కాలనీ తిరుమలగిరి, ఎస్టీ కాలనీ తొండ, రాఘవపురం, చింతలకుంట పాఠశాలల్లో పనులు పూర్తయినా ఇప్పటివరకు బిల్లులు అందక కాంట్రాక్టర్లు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో పాఠశాలకు రూ.10 లక్షలకు పైగానే బిల్లులు రావాల్సి ఉంది. దీంతో మండలంలోని మిగతా పాఠశాలల్లో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. సరైన సమయానికి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు పనులు చేయలేకపోతున్నారు. మన ఊరు–మన బడి పనుల బిల్లులు జిల్లా కలెక్టరేట్ అధికారుల లాగిన్‌లో సీజ్ అయినట్లు తెలుస్తోంది. పనులు పూర్తయిన వాటికి అధికారులు వెంటనే నిధులు విడుదల చేస్తే మిగిలిన పనులు చేయిస్తామని కాంట్రాక్టర్లు తెలుపుతున్నారు.

**బిల్లులు విడుదల చేయాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులకు సకాలంలో డబ్బులు విడుదల కాకపోవడం లేదు. దీంతో కాంట్రాక్టర్ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు డబ్బులు వెంటనే విడుదల చేస్తే మిగిలిన పనులు కూడా పూర్తవ్వడానికి అవకాశం ఉంటుంది.

– వెంకన్న, విద్యార్థి తండ్రి, తొండ

# నూతన భవన నిర్మాణానికి కృషి



భానుపురి : గౌడ పెద్దలతో సమావేశమైన మంత్రి

భానుపురి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని, త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి తెలిపారు. మంగళవారం పాలకవర్గ సభ్యులు, గౌడ పెద్దలతో కలిసి పట్టణంలోని కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం పాత భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. త్వరలోనే రూ.3కోట్ల మేర నిధులు విడుదల చేయించి నూతన భవనం నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాపర్తి పెద్ద శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఎల్గూరి గోవింద్, ప్రధాన కార్యదర్శి గుణగంటి కృష్ణ, కోశాధికారి కక్కిరేణి సత్యనారాయణ, డైరెక్టర్లు కప్పల శశిరేఖ, పోడిశెట్టి వెంకన్న, బొమ్మగాని చిన్న మారయ్య, అయితగాని జనార్దన్, గౌడ పెద్దలు కక్కిరేణి నాగయ్య, కౌన్సిలర్లు రాపర్తి శ్రీనివాస్, అనంతుల యాదగిరి, పల్సా వెంకన్న, రాపర్తి సత్తయ్య పాల్గొన్నారు.

**ఆర్చీల నిర్మాణానికి శంకుస్థాపన**

పట్టణంలోని తాళ్లగడ్డ ఇంద్రవెళ్లి ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లే దారిలో రెండు ఆర్చీల నిర్మాణానికి మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ బైరు వెంకన్నగౌడ్ మంత్రిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వై.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి, లక్ష్మీకాంతమ్మ, ఆనంద్, నాగయ్య, బూర బాలసైదులు పాల్గొన్నారు.

**మంత్రి, ఎమ్మెల్యేను కలిసిన నాయకులు**

అర్వపల్లి : తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు పీఆర్సీ అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి జగదీష్‌రెడ్డి, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పేస్కేల్‌ను ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి వేణు, వెన్నెల నాగరాజు పాల్గొన్నారు.



ఆర్చీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సారథి కళాకారులు

# సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

భానుపురి : పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకల సందర్భంగా మంగళవారం కలశ స్థాపనతో త్రయాహ్నిక దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణ సంతోషిమాత అమ్మవారికి అభిషేకం చేశారు. అమ్మవారి సన్నిధిలోని శ్రీచక్రంనకు కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రత్యేక మండపంపై కలశ స్థాపన, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, కంకణ ధారణ చేపట్టారు. రుద్ర హోమం, లలితా హోమం నిర్వహించారు. మంగళనీరాజనం, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామమూర్తి, ఉత్సవ నిర్వాహకులు యామా పురుషోత్తం, కొత్త మల్లికార్జున్, దేవరశెట్టి సోమయ్య, బెలిదే అశోక్, కమిటీ సభ్యులు కక్కిరేణి పద్మావతి, కర్నాటి సూర్యకళ, దేవాలయ సహాయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ, దరూరి కృష్ణమాచార్యులు, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### టీకాలు వేయించాలి

తుంగతుర్తి : రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సర్పంచ్ మిట్టగడ్పుల అనోక్ అన్నారు. మంగళవారం అన్నారం గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రవిప్రసాద్, మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్, డాక్టర్ మమత, సూపర్‌వైజర్ శ్రీనివాస్, గోపాలమిత్రలు శ్రీనివాస్‌రెడ్డి, లింగయ్య, శ్రీను పాల్గొన్నారు.

### ధర్నాను జయప్రదం చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : సెప్టెంబర్ 1వ తేదీన విద్రోహ దినం పురస్కరించుకొని హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ పోరాట కమిటీ జిల్లా నాయకుడు పేరం ముత్తయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, పీఆర్సీ కమిటీ నియమించి, 2023 జూలై నుంచి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్కావెంజర్లను నియమించి, విద్యారంగంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# అక్రమార్కులను అరికట్టడం సాధ్యం కాలేదా..?



సమావేశంలో మాట్లాడుతున్న కుంట్ల ధర్మార్జున్

భానుపురి : అక్రమార్కుల నార తీస్తానని ప్రగల్భాలు పలుకుతున్న మంత్రి జగదీష్ రెడ్డికి ఇన్నాళ్లు సాధ్యం కాలేదా అని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మార్జున్ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. జగదీష్ రెడ్డికి నిజాయితీ ఉంటే కుడకుడ గుట్టల చుట్టూ అన్యాక్రాంతమైన సర్కారు భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. దళితబంధు ఆశ చూపించి ఇతర పార్టీల్లో ఉన్న నాయకులను చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి అనైతిక చర్యలను మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు గట్ల రమా శంకర్, జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్యయాదవ్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్, నాయకులు కుంచం చంద్ర కాంత్, వీరేష్‌నాయక్, బొమ్మగాని వినయ్ గౌడ్, సుమన్ నాయక్, వల్కి రాజు, జాటోతు శ్రీను, పానుగోటి సూర్యనారాయణ, సతీష్, మల్సూర్, ఈశ్వర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



తిరుమలగిరి : జలాల్‌పురంలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ స్నేహలత



అర్వపల్లి : క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ వీరప్రసాద్



నాగారం జెడ్పీహెచ్‌ఎస్‌లో మండలస్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కూరం మణి

తిరుమలగిరి : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. మంగళవారం జలాల్‌పురం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎంఎస్ ఫౌండేషన్ సహకారంతో ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు భోజన సౌకర్యంతోపాటు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, మల్లిఖార్జున దేవస్థానం చైర్మన్ ముత్తినేని సత్యం, సర్పంచ్ కొమ్ము వెంకన్న, ఎంపీటీసీ దరావత్ రంగమ్మ, మండల పంచాయతీ అధికారి మారయ, హెచ్‌ఎం అశోక్ పాల్గొన్నారు.

అర్వపల్లి : క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్య యాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం పాఠశాలల మండల స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, ఎంపీఓ సందీప్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ మామిడి నాగరాజు, హెచ్‌ఎం కె.తబిత, పీడీ సోమయ్య, పున్న హరిప్రసాద్, కుంభం నాగరాజు, పీఈటీలు లింగాల రవి, ఎల్.సైదులు, కె.లలిత, బి.సైదులు, ఆకారపు శ్రీను పాల్గొన్నారు.

నాగారం : క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న మండల స్థాయి అండర్–14, 17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను నియోజకవర్గస్థాయి క్రీడలకు ఎంపిక చేస్తారని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు మంత్రి జగదీష్ రెడ్డి తల్లి సావిత్రమ్మ జ్ఞాపకార్థం భోజన వసతి కల్పించి, బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, ఎంపీడీఓ జి.శోభారాణి, ఎంఈఓ బాలునాయక్, ఎస్‌ఐ జి.ముత్తయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్లు నవనీత, చిప్పలపల్లి మల్లేష్, హెచ్‌ఎంలు పల్సా వెంకన్న, నారాయణ పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడిస్తాం



మాట్లాడుతున్న కోట గోపి

మద్దిరాల : కేసీఆర్ మోసపూరిత విధానాలను ఎండగడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నికలో కమ్యూనిస్టు పార్టీ మద్దతుతో గెలిచిన బీఆర్‌ఎస్ ఇప్పుడు బీజేపీతో లోపాయకార ఒప్పందం కుదుర్చుకొని మిత్రద్రోహం చేశారని అన్నారు. దళిత బంధు, బీసీ మైనార్టీ రుణాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, గృహలక్ష్మి వంటి పథకాలన్నీ కేవలం అధికార పార్టీ నాయకులకే ఇస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల పేరుతో అమాయక ప్రజల నుంచి లక్షల రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 1నుంచి 10వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సమావేశాలు, సెప్టెంబర్ 10 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కందాల శంకర్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, మండల కమిటీ సభ్యులు చిదిరాల నారాయణ, అల్లి మల్లయ్య, బ్రహ్మచారి, ఉబ్బని వీరయ్య, పోలోజు సైదులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

నాగారం : 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 18ఏళ్లు నిండి కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకునే వారికి సెప్టెంబర్ 2, 3 తేదీలలో గ్రామాల్లోని పోలింగ్ బూతుల వద్ద ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే అక్టోబరు 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు కూడా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ అవకాశం కల్పించిందని తెలిపారు. ఆయనతో పాటు డీటీ షాహిన్‌బేగం, ఆర్‌ఐ లక్ష్మీనర్సింహారావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

### మున్నూరుకాపు నాయకుల ముందస్తు అరెస్టు



అరెస్టయిన మున్నూరుకాపు నాయకులు

తుంగతుర్తి : మున్నూరుకాపుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రం నుంచి ప్రగతిభవన్ ముట్టడికి వెళ్తున్న ఆ సంఘం నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం నాయకులు మాట్లాడారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్యని అన్నారు. అరెస్టయిన వారిలో గాజుల యాదగిరి, ఎల్లబోయిన భిక్షం, ముత్యాల వెంకటేశ్వర్లు, ఆకుల హనుమయ్య, పప్పుల వెంకన్న, చెవ్వ వెంకన్న, నరేందర్, నాగరాజు, శ్రీకాంత్, నవీన్, అనిల్, వెంకటేష్, సైదులు తదితరులు ఉన్నారు.

# కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేలా పాలన



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేలా పనిచేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజలను లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టాయని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఖండిస్తూ సీపీఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1నుంచి 10వ తేదీ వరకు అంతటా నిరసన ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చినపంగి నర్సయ్య, వీరబోయిన రవి, సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, మడ్డి అంజిబాబు, చంద్రయ్య, గోపాల్ రెడ్డి, బొమ్మిరెడ్డి గోపిరెడ్డి, కొండమీది రాములు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# జానయ్యపై కేసులు ఉపసంహరించుకోవాలి



తిరుమలగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న యాదవ సంఘం నాయకులు

తిరుమలగిరి : డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్‌పై కక్ష పూరితంగా పెట్టిన అక్రమకేసులు ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు డిమాండ్ చేశారు. మంగళవారం తిరుమలగిరిలోని తెలంగాణ చౌరస్తాలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. గత పది సంవత్సరాల నుంచి ఎన్నడూ లేని కేసులు ఇప్పుడు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాలను అణచివేయడానికే ఈ అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. జానయ్య యాదవ్‌పై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెండవ వార్డు కౌన్సిలర్ హన్మంతు యాదవ్, మల్లయ్య, కిరణ్‌యాదవ్, లింగయ్య, రవీందర్, వెంకన్న, రాములు, సోమయ్య, గంగాధర్, యాదగిరి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆవరణలో నీరు నిల్వకుండా మరమ్మతులు



పాఠశాల ఆవరణలో పోసిన మొరం

అర్వపల్లి : వర్షం వచ్చిన ప్రతిసారి గుట్టల నుంచి వచ్చే జాలుతో అర్వపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణ బురదమడుగును తలపిస్తోంది. ఈ పాఠశాలకు విశాలమైన ఆవరణ ఉన్నప్పటికీ వర్షాలకు ఆవరణ నీటితో నిండుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇటీవల మన ఊరు–మన బడి కార్యక్రమంలో పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు సుమారు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో డైనింగ్‌హాల్, కిచెన్ షెడ్, మరుగుదొడ్లు నిర్మించారు. కానీ ఆవరణ సమస్య అలాగే మిగిలిపోయింది. దీంతో సర్పంచ్ బైరబోయిన సునీతారామలింగయ్య నాలుగు రోజులుగా పాఠశాల ఆవరణలో మొరం పోయించి డోజర్‌తో చదును చేయిస్తున్నారు. ఇప్పటికే పాఠశాల ఆవరణ చదును పనులు సగం వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూడా వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. పాఠశాల ఆవరణలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### గ్రంథాలయ పుస్తకాలు అందజేత



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చివ్వెంల : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కుడకుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 34 పాఠశాలలకు పుస్తకాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు భాషలో అనర్గళంగా మాట్లాడడానికి పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యాస రాంకుమార్ రెడ్డి, బత్తుల దామోదర్ రెడ్డి, కాళిదాసు, వార్డు కౌన్సిలర్లు ఎలమినేటి అభినయ్, వెములకొండ పద్మ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

# పండ్లు, కూరగాయల్లో పోషకాలపై అవగాహన



పెన్‌పహాడ్ : దూపహాడ్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



మాంటిస్సోరి పాఠశాలలో కూరగాయలు, పండ్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెన్‌పహాడ్ : పండ్లు, కూరగాయల్లోని పోషక విలువలపై దూపహాడ్ గ్రామంలో సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు మంగళవారం ఆ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పండ్లు, కూరగాయల్లో ఎలాంటి రసాయనాలు లేకుండా సులువుగా ఇంట్లోనే జ్యూస్‌లు చేసుకునే విధానం చేసి చూపించారు. అంతేకాకుండా గ్రామస్తులతో కూడా చేపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు దీపికరెడ్డి, శివాని, పుష్ప, భాగ్య, శ్రీశార్వాణి, శ్వేత, మనోగ్న, దివ్య, వైష్ణవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని స్థానిక మాంటిస్సోరి పాఠశాల కరెస్పాండెంట్ విపిన్‌కుమార్ అన్నారు. మంగళవారం పాఠశాలలో పండ్లు, కూరగాయల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండ్లు, కూరగాయల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలిజబెత్, పాఠశాల ఇన్‌చార్జ్ గిరిజ, ఉపాధ్యాయులు కె.చంద్రశేఖర్, రమ, రజిత, సంతోష, విద్యార్థులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి



సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతూ మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడతామని 2016లో కేసీఆర్, అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరిలు హామీ ఇచ్చి అక్షయ పాత్ర ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించినా నేటికీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు పుల్లూరి సింహాద్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, శ్రీకాంత్, బాలు, సలోమి, ఉమ, కావ్య, అశ్విత, శ్రావణి, హాసిని, షాహిన, హర్షత్, సిద్దు, విగ్నేష్, నవ్య, హేమంత్, పరశురాం పాల్గొన్నారు.

### విద్యార్థులు ఇష్టపడి చదవాలి

కోదాడ : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఎస్‌ఆర్‌ఎం పాఠశాల విద్యార్థులు ఆయనను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎమ్మెల్యేకు ముందస్తుగా రాఖీలు కట్టారు.